క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



ఆలయ పునర్నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న పీవీఎల్ తదితరులు

కాళ్ల : ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ, కొండాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పీవీఎల్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో గ్రామమంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సర్పంచ్ భూపతి జగ్గారాజు, ఎంపీటీసీ చిన్నావరపు రాంబాబు, ఆలయ కమిటీ చైర్మన్ వక్కపట్ల హరిబాబు, పచ్చిగోళ్ళ శ్రీను, పడమటి సుబ్బయ్య, వక్కపట్ల వెంకటేశ్వరరావు, పడమటి సతీష్, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం



మాదివాడ దేవస్థానాల ఆవరణలో అష్టావధానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు : స్థానిక మాదివాడ దేవాలయం సముదాయంలో శనివారం నిర్వహించిన అష్టావధానం కార్యక్రమం సాహితీ ప్రియుల్ని అలరింపజేసింది. శతావధాన శరచ్చంద్ర, మైసూరు దత్త పీఠ స్వర్ణకంకణ సత్కార గ్రహీత తాతా సందీప్ శర్మ అవధాని ఆధ్వర్యంలో అష్టావధానం జరిగింది. విశ్రాంత సంస్కృత విభాగాధిపతి రాయప్రోలు వేంకట కామేశ్వర శర్మ సంచాలకత్వంలో ప్రముఖ అధ్యాపక, విశ్రాంతి ఉపాధ్యాయులు చిర్రావూరి సూర్యనారాయణమూర్తి, ఎం.రామకృష్ణారావు, సుదర్శనం ఫణికుమార్, కడిమెళ్ల శ్రీవిరించి, పసుపులేటి రామచంద్రరావు, లంక నాగ శశికళ, కాకర్ల రాజరాజేశ్వరి, తెన్నేటి మాస్టారు పృచ్ఛక వర్గంలో పాల్గొన్నారు. పృచ్ఛక వర్గ సభ్యులు అడిగిన ప్రశ్నలకు అవధాని శర్మ సాహితీ రూపంలో పద్యం వల్లించి చెప్పిన తీరు పలువుర్ని ఆకర్షించుకుంది. మధ్యలో అప్రస్తుత ప్రసంగం, నిషిద్ధాక్షరి, వ్యస్తాక్షరి అడిగిన ప్రశ్నలతో వేడెక్కిన వాతావరణంలో సభా ప్రాంగణం నవ్వుల వర్షం కురిసింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌లు గునుకుల కొండయ్య, మోటుపల్లి రాజు సాహితీమూర్తుల్ని సత్కరించారు. అనంతరం తెలుగు ఉపన్యాసకురాలు లంక నాగ శశికళ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

మెరుగు పెడతామంటూ మోసం చేశారు

నరసాపురం రూరల్: బంగారు ఆభరణాలకు మెరుగు పెడతామంటూ మాయమాటలు చెప్పి 8 కాసుల బంగారాన్ని దొంగిలించిన సంఘటన నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం చాగంటి వారిమెరక గ్రామంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ ఎస్సై సుధాకరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో మండలంలోని లక్ష్మణేశ్వరం చాగంటి వారిమెరక గ్రామానికి చెందిన తోట వెంకటలక్ష్మి అనే 60 ఏళ్ల వృద్ధురాలి ఇంటికి ఇరువురు వ్యక్తులు వచ్చి బంగారు వస్తువులకు మెరుగు పెడతామని చెప్పి నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన వృద్ధురాలు నాలుగు బంగారు గాజులను వారికి ఇవ్వగా ఆ గాజులకు ఏదో తైలం రాసి కుక్కర్‌లో ఉంచి కాసేపటి తర్వాత స్టవ్‌ను ఆఫ్ చేసి చల్లారిన తర్వాత తీయాలని సూచిస్తూ వృద్ధురాలిని మాటల్లో మభ్యపెట్టి ఆమె ఇచ్చిన గాజులను కుక్కర్‌లో పెట్టకుండానే పెట్టినట్లుగా నాటకమాడి బయటకు ఉడాయించారు. అనంతరం వృద్ధురాలు కుక్కర్ మూత తీసి చూసి అవాక్కయ్యి నగలతో వారు ఉడాయించారని గ్రహించి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డ్రోన్ సర్వేతో ఎంతో మేలు

ఎమ్మెల్యే శ్రీనివాస్



భీమవరంలో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



భాస్కర వెంకటవర్మను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: జగనన్న శాశ్వత భూహక్కు పథకం రైతులకు, భూయజమానులకు ఎంతోగానో ఉపయోగపడుతుందని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద భీమవరం పట్టణంలో డ్రోన్ సర్వేను ప్రారంభించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడో బ్రిటిష్ కాలంలో భూ సర్వే నిర్వహించారని అయితే నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా భూయజమానులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి శాశ్వతంగా భూ హక్కును కల్పించడానికి డ్రోన్ సర్వే చేపట్టినట్లు చెప్పారు. అనేకమంది రైతులకు తమ భూములకు సంబంధించి సమగ్రమైన రికార్డులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రోన్ సర్వే వల్ల రైతులు, ఇతర స్థలాలకు సంబంధించిన శాశ్వత భూహక్కు పొందుతారని శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో సైతం నిర్వహించే డ్రోన్ సర్వే వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ గౌరు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

సాక్షి, భీమవరం: విద్యను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో వీరవాసరం మండడం కొణితివాడ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి యరక రాజు భాస్కర వెంకట వర్మ 571 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో విద్యార్థి వెంకటభాస్కరవర్మను శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధించడానికి అనుగుణంగా విద్యనభ్యసించాలన్నారు. ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్య ఇస్తూ ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు సమకూర్చడంతోపాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధనతో మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషిచేస్తున్నారన్నారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొణితివాడ ఉపసర్పంచ్ నాగరాజు వెంకట శ్రీనివాసరాజు, తదితులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి సన్నిధిలో...



చెన్నకేశవస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కవురు, పాతపాటి శ్రీనివాసరాజు

ఉండి : ఉప్పులూరు గ్రామంలో వేంచేసియున్న చెన్నకేశవస్వామిని ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, ఆలయ చైర్మన్ యర్రా వెంకట సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కొంచాడ వెంకటేశ్వరరావు, దాసరి సనాతన, నిమ్మల బాబ్జి, యర్రా రాంబాబు, దేవబత్తుల పోలు పాల్గొన్నారు.

ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి



పాములపర్రులో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఉండి : ప్రజలందరికీ సురక్షితమైన తాగునీటిని అదించాలని, ఈ విషయంలో అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం పాములపర్రులో పర్యటించిన ఆమె స్థానిక మంచినీటి చెరువును పరిశీలించారు. మంచినీటి చెరువును ప్రక్షాళన చేసి పటిక, బ్లీచింగ్ వంటివి వాడి శుభ్రం చేయాలని సూచించారు. అలాగే చెరువుకు నీరు వస్తున్న కాలువకు ఇరువైపులా ఉన్న చెరువుల వ్యర్థాలు కలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని టాంటాం ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. అన్ని గ్రామాల్లోను అధికారులంతా అప్రమత్తంగా ఉండి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఉండి మండలం చెరుకువాడలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు చేపట్టిన కార్యక్రమాల వివరాలు తనకు తెలియచేయాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులకు సూచించారు. అలాగే లబ్ధిదారులకు అవగాహన కల్గించి నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. జగనన్న లేఅవుట్స్‌లో ఎక్కడా మౌలిక వసతులకు ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. సొంత స్థలం కలిగి దరఖాస్తు చేసుకున్న 15 మంది ఇళ్ల నిర్మాణాలకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం రవికుమార్, హౌసింగ్ ఈఈ బీ వెంకటరమణ, డీటీ ఎస్‌వీఎస్ నాయకుడు, ఎంపీడీవో ఏవీ అప్పారావు, హౌసింగ్ డీఈ పీ శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకూరు వెంకన్నకు రూ.74 వేల ఆదాయం

కాళ్ల : కాళ్లకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన చీరలు, పంచెల బహిరంగ వేలం ద్వారా రూ.74,730 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈఓ మోకా అరుణ్ కుమార్ తెలిపారు. దేవస్థానం ధర్మకర్తల మండలి సమక్షంలో ఆలయ ప్రాంగణంలో శనివారం వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థతో అవినీతికి చెక్



కొమరాడ గ్రామంలో వలంటీర్లను సత్కరించిన దృశ్యం

భీమవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థతో సంక్షేమ పథకాలు అందించడంతో అవినీతి, అక్రమాలు లేకుండా వలంటీర్ ద్వారా నేరుగా లబ్ధిదారుని ఇంటి ముంగటకే వెళ్లడంతో రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి అన్నారు. భీమవరం మండలంలోని కొమరాడ గ్రామంలో వలంటీర్‌లకు వందనం కార్యక్రమంలో భాగంగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను శనివారం వలంటీర్లను ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాట్నాల రామకృష్ణ స్వామి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఏదైనా ప్రభుత్వం నుంచి అందాలంటే జన్మభూమి కమిటీలు చుట్టూ తిరగడమే కాకుండా వారికి కొంత సొమ్ము ముట్టచెప్పితేనే పనులయ్యేయన్నారు. అంతేకాకుండా బర్త్, డెత్, ఇన్‌కమ్, కులధ్రువీకరణ తదితర సర్టిఫికేట్లు కావాలంటే మండలాఫీసులు చుట్టూ తిరగాల్సి వచ్చేదని ఇప్పుడు వలంటీర్ల ద్వారా మన ఇంటిముంగటకే వస్తున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. వలంటీర్లు గౌరవ వేతనంగా మనందరికి సేవలు చేయడం అభినందనీయమని వారిని శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు



కోలమూరులో వలంటీర్లను సత్కరిస్తున్న పీవీఎల్



శృంగవృక్షంలో వలంటీర్లను సన్మానిస్తున్న పీవీఎల్

ఉండి : జగనన్న సంక్షేమ పాలనకు సచివాలయ వలంటీర్లే వారధులు అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. శనివారం ఉండి మండలం కోలమూరులో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వాండ్రం, ఎన్నార్పీ అగ్రహారం, పాములపర్రు, కోలమూరు, ఉప్పులూరు, కలిగొట్ల, ఆరేడు గ్రామాలకు చెందిన వలంటీర్లకు సన్మానం చేసి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు నిత్యం చేరవేస్తున్న వలంటీర్లను సత్కరించడం మన బాధ్యత అని అన్నారు. కరోనా మహమ్మారిని మన రాష్ట్రంలో దిగ్విజయంగా ఎదిరించడానికి వలంటీర్‌లు చేసిన కృషి ఎంతో గొప్పదన్నారు. టీడీపీ హయాంలో వారు చెప్పిన వారికే పథకాలు అందేవని, కానీ జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలతో రాష్ట్రం కళకళలాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, మహంకాళి, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, గంద్రాజు రాజేష్ వర్మ, సర్పంచ్, ఉపసర్పంచ్ నడింపల్లి సత్యవతి, నడింపల్లి రామకృష్ణంరాజు, ఎంపీటీసీ అల్లూరి మాధవి, చెక్‌పోస్టు రాజు, కేశవరాజు, చింతలపాటి రఘుపతిరాజు, సర్పంచ్‌లు దాసరి వెంకటకృష్ణ, సూరవరపు కనకదుర్గ, కత్రెడ్డి బ్రహ్మానందం, రంగరాజు, వర్రే పైడియ్య, నిమ్మల కేశవకుమార్, ఆలమూరి కృష్ణ, గద్దం భాగ్యరాజు, నిమ్మల బాబ్జి, యర్రా కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సిఫార్సులతో పనేలేదు

పాలకోడేరు : ఎటువంటి సిఫార్సులు అవసరం లేకుండా అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. శనివారం శృంగవృక్షం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. విస్సాకోడేరు, గొరగనమూడి, పెన్నాడ, శృంగవృక్షం సచివాలయం వలంటీర్లను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ వలంటీర్లు మరింత బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, కానీ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చి నవరత్నాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఇతర పార్టీలు కలిసి పోటీచేసేందుకు సమాయత్తం అవుతుంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలమీద ఉన్న నమ్మకంతో ఒంటరిగా పోటీ చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలిదిండి కృష్ణంరాజు, పెన్మత్స శ్రీనివాసరాజు, గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు, కటిక శ్రీదేవి, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు, సర్పంచులు బొల్లా శ్రీనివాస్, జంగం సూరిబాబు, చిల్లా అనూష, వైస్ ఎంపీపీలు సోడదాసి నరేష్, ఆదాడ లక్ష్మీ తులసి, ఎంపీటీసీలు షేక్ పాపా సాహెబ్, బళ్ళ భారతి, ఆరేపల్లి పెద్ద వెంకటస్వామి, మల్లుల సూర్యకళ, నాయకులు గునుపూడి పాండురంగారావు, కలిదిండి ఆనందరాజు, బొక్కా రాంబాబు, పేరిచర్ల కనకరాజు, నడింపల్లి రామకృష్ణంరాజు, గరగపర్రు అబ్బులు, గెడ్డం జోషి శివకోడు అనుమంతరావు, జేఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ, ఈవోపీఆర్డి వి.రెడ్డియ్య, డీఆర్ స్వర్ణలత పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆకివీడుగా అభివృద్ధికి చర్యలు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణమోహన్

ఆకివీడు : స్వచ్ఛ ఆకివీడుగా పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి విజ్ఞప్తి చేశారు. నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ అన్ని వార్డుల్లో డ్రెయినేజీ, పారిశుధ్యం మెరుగునకు చర్యలు చేపట్టామన్నారు. కమిషనర్ జీ.కృష్ణమోహన్ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యానికి కారణమైన పాలిథిన్ వ్యర్థాల్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. పాలిథిన్ కవర్ల వినియోగాన్ని తక్షణం నిలుపుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రెయినేజీల్లో, ఖాళీ ప్రదేశాల్లో పాలిథిన్ వ్యర్థాలు అపారంగా పెరిగిపోయాయన్నారు. కాలుష్యంతో ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉందని చెప్పారు. మంచినీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణంలోని అన్ని రక్షిత మంచినీటి పథకాల ద్వారా నీటి సరఫరా చేసే సమయంలో పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించామని కమిషనర్‌కు వివరించారు. వైస్ చైర్మన్ పుప్పాల పండు మాట్లాడుతూ పట్టణంలో ఎన్ని కుళాయిలున్నాయి, కొత్త కుళాయిల మంజూరుకు చర్యలు చేపట్టాలని, దీనిద్వారా పంచాయతీకి ఆదాయం లభిస్తుందన్నారు. ఖాళీ స్థల యజమానుల్ని గుర్తించి, ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా చూడాలన్నారు. ఖాళీ స్థలాలకు త్వరితగతిని పన్ను విధించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు త్వరితగతిని పనులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ మోటుపల్లి కుమారి మాట్లాడుతూ తన వార్డు పరిధిలో కుళాయిల ద్వారా మంచినీరు సరఫరా కావడంలేదని, కలుషిత నీరు సరఫరా అవుతుందని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన ఫొటోల్ని సమావేశంలో చూపించారు. తొలుత అజెండాలోని పలు అంశాల్ని సమావేశం ఆమోదించింది. గత బడ్జెట్‌లో పొందుపరచిన జమాఖర్చులను పరిపాలనామోదం కోసం తీసుకువచ్చిన అంశాన్ని ఆమోదించారు. వీధిలైట్ల ఏర్పాటు, పలు అభివృద్ధి పనులకు టెండర్లు, తదితర అంశాల్ని ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ వంగా జ్యోత్స్న, కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్, గేదల అప్పారావు, నిమ్మల నాగు, తిరుమారెడ్డి మాధవి, ఎండీ. అనపున్నీస్సా, ఎండీ.జక్కీ, గుండుగొలను సావిత్రి, జిల్లా పెద్దిరాజు, దొడ్డి జగదీష్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన మత్స్యశాఖ కమిషనర్

నరసాపురం రూరల్: మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి కె కన్నబాబు శనివారం నరసాపురం మండలం సరిపల్లి రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందుతున్న వివిధ రకాల సేవలను గురించి ఆరాతీశారు. సేవలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారా? లేదా? అనే దానిపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫాజిల్, డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావు, ఎంపీడీవో శివప్రసాద్‌యాదవ్, వ్యవసాయశాఖ ఏడీఏ అనిల్ కుమారి ఉన్నారు.

పిచ్చికుక్క కరిచి బాలుడికి గాయాలు



ఆకివీడు: పట్టణంలోని అయిభీమవరం రోడ్డు మలుపు వద్ద పిచ్చికుక్క కరవడంతో ఓ బాలుడికి గాయమైంది. వివరాలిలా ఉన్నాయి. అయిభీమవరం రోడ్డులో శుక్రవారం రాత్రి పిచ్చికుక్క పరుగులు తీస్తూ సమీపంలో ఉన్న ఓ ఇంట్లోకి వెళ్లి అందులో ఉన్న రెండున్నర ఏళ్ల బాలుడు పప్పల రేహాంత్ కుమార్ కంటిపై కరిచింది. వెంటనే బాలుడి తల్లిదండ్రులు మధు, రజని కేకలు వేయడంతో కుక్క బయటకు వెళ్లిపోయింది. స్థానికులు వెంబడించి పిచ్చికుక్కను చంపివేశారు. బాలుడ్ని స్థానిక ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు.